క్లుప్తంగా

జేఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలి



వ్యాక్సినేషన్ అయినట్లు ధ్రువీకరణ పత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ, మండలంలో 9 నెలల నుంచి 15ఏళ్లలోపు పిల్లలందరూ జేఈ(జపనీస్ ఎన్‌సీఫలైటీస్)మందును వేసుకోవాలని మండల వైద్యాధికారి రేవతిరెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కౌన్సిలర్ లక్ష్మమ్మతో కలిసి ఆమె ప్రారంభించారు. అదేవిధంగా రావులపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో వ్యాక్సిన్లు వేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. పిల్లలలో వైరల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా మెదడువాపు వ్యాధి వచ్చే అవకాశం ఉందని, ఈ వ్యాక్సిన్ తీసుకోవడంతో అరికట్టవచ్చని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు దగ్గరలోని ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఫిరంగి కాల్వ పరిశీలన



కాల్వకు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నర్సింలు, నాయకులు

శంకర్‌పల్లి: మండలం గుండా ప్రవహిస్తున్న ఫిరంగి కాల్వలో పెద్దఎత్తున ఆక్రమణలు జరిగాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బుల్కాపూర్, మోకిల, పిల్లిగుండ్ల గ్రామాల్లో పర్యటించిన ఆయన ఫిరంగి కాల్వను పరిశీలించారు. మోకిలలో గండిపడిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిరంగి కాల్వ చుట్టూ అనేక అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆరోపించారు. కాల్వ గండిపడడంతో రైతులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు లేఖ రాయనున్నట్లు స్పష్టం చేశారు. ఆయన వెంట నాయకులు సుభాన్‌గౌడ్, యాదయ్య, జగదీశ్వర్‌రెడ్డి, మాణిక్యం, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా బడ్జెట్

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ ఛైర్మన్ మహేందర్‌ముదిరాజ్

మొయినాబాద్‌రూరల్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను నిరాశపరిచేలా ఉందని, తెలంగాణ పురోగతికి కొత్త ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ ఛైర్మన్ నారాయణపురం మహేందర్‌ముదిరాజ్ తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఆయన హిమాయత్‌నగర్‌లో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షకు పూర్తిగా విభిన్నంగా ఉన్న బడ్జెట్‌ను రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎనిమిది మంది ఎంపీలు తమ నిరసన గళం విప్పాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ అక్షరం ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు. బడ్జెట్ తెలంగాణకు మొండిచేయి చూపిందని ప్రజలను తీవ్ర అసంతృప్తికి గురి చేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది ఎంపీలు ప్రధాని మోదీని కలిసి రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని వివరించాలని కోరారు. తెలంగాణకు బడ్జెట్ నిధులు తీసుకురావాలని ఎంపీలకు విజ్ఞప్తి చేశారు.

గ్రామ అభివృద్ధికి సహకరించాలి

మొయినాబాద్‌రూరల్: గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. గురువారం హిమాయత్‌నగర్ పంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారి రాగమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా హిమాయత్‌నగర్ గ్రామంలో జరిగే అభివృద్ధి పనులను సంధ్యారాణి చదివి వినిపించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీలత, జెడ్పీ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ మహేశ్వరీలు బాత్‌రూమ్‌లు అధ్వానంగా ఉన్నాయని, నీటి సౌకర్యం సక్రమంగా లేదని తెలిపారు. వీటిని అభివృద్ధి చేసేందుకు గ్రామ పంచాయతీ ద్వారా కృషి చేయాలని వారు కోరారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు అందరూ సహకరించాలని సంధ్యారాణి కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కవిత, గ్రామస్తులు రవియాదవ్, మల్లేశ్, రమేశ్, అశోక్‌ముదిరాజ్, పంచాయతీ కారోబార్ శ్రీనివాస్‌గౌడ్, బిల్ కలెక్టర్ షాబాద్ యాదయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాయ'దారి' చెత్త!

- రోడ్డుపైనే చెత్తడంపింగ్
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు, స్థానికులు



మొయినాబాద్-సురంగల్ రోడ్డుపై డంపింగ్ చేసిన చెత్త

మొయినాబాద్: మండల కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. మొయినాబాద్ నుంచి సురంగల్ వెళ్లే రోడ్డు రోగాల దారిగా మారింది. రోడ్డుపైనే చెత్త డంపింగ్ చేస్తుండడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి దారుణంగా మారినా పంచాయతీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మొయినాబాద్ గ్రామ పంచాయతీ రోజురోజుకు విస్తరిస్తుండడంతో ప్రతి రోజు సుమారు 10 టన్నుల చెత్త వెలువడుతుంది. పంచాయతీ సిబ్బంది చెత్తను ట్రాక్టర్లలో తీసుకెళ్లి సురంగల్ వెళ్లే రోడ్డు పక్కన డంప్ చేస్తున్నారు. అయితే గత వారం రోజుల నుంచి చెత్తను పూర్తిగా రోడ్డుపైనే వేస్తున్నారు. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వేసిన చెత్త కంపుకొడుతుండడంతో వాహనదారులు ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈగలు, దోమలతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాలు పడుతుండడంతో ఇలాంటి చెత్త డంపింగ్‌తో వ్యాధులు ప్రబలే పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మున్సిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రభుత్వం రైతులకు రుణాలు మాఫీ చేస్తున్న నేపథ్యంలో బ్యాంక్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం బ్యాంక్, వ్యవసాయశాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. రుణమాఫీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, సాంకేతిక పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. వ్యవసాయశాఖ ఏడీ రాజారత్నం మాట్లాడుతూ... షాద్‌నగర్ బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులో రుణాలు తీసుకున్న 546 మంది రైతులకు సాంకేతిక కారణాలతో వారి ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమకాలేదని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన అందరికీ రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో బ్యాంకుల మేనేజర్లు, ఏఓ, ఏఈఓలు పాల్గొన్నారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష చూపడం తగదు

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించడంలో బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపించిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. విభజన చట్టంలోని ఆర్టికల్ 3 ప్రకారం కేంద్రం ఏ అంశాలను కూడా పరిగణలోకి తీసుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి 8 స్థానాలను గెలిపిస్తే కేంద్రం ఈ ప్రాంతానికి బడ్జెట్‌లో అన్యాయం చేసిందని విమర్శించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



రైతులకు వ్యవసాయ ఉపకరణాలను పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

షాబాద్: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు వొంగురు విజయ్‌భాస్కర్‌రెడ్డి, వెటర్నరీ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.వి.నర్సింహారావు పేర్కొన్నారు. గురువారం రేగడిదోస్వాడ గ్రామంలో సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం వార్షిక సమావేశం నిర్వహించారు. అనంతరం సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం నూతన కార్యాయాన్ని ప్రారంభించి, కొత్తగా సభ్యత్వం తీసుకున్న రైతులకు ఫౌండేషన్ అధ్యక్షుడి చేతుల మీదుగా వ్యవసాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పాడి రైతులకు పాల దిగుబడి పెంపు, పాల ఉత్పత్తులు తయారీపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, మల్లారెడ్డి, మాధవ రెడ్డి, కమలాకర్‌రెడ్డి, వీరామల్లరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణయ్య, సురేశ్, వెంకటయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలనకు కృషి

సీడీపీఓ నాగమణి



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న సంస్థ మేనేజర్, ఐసీడీఎస్ అధికారులు

కొత్తూరు: మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి కోరారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ షాద్‌నగర్ వారి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీలకు మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ బల రామకృష్ణతో పాటు సీడీపీఓ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే 3వ అతిపెద్ద నేరంగా పరిగణించబడిందన్నారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ తమ కేంద్రాల పరిధిలో ఉన్న మహిళలు, అమ్మాయిలకు అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన కల్పించాలని సూచించారు. వారికి ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మానవ అక్రమ రవాణా నిర్మూలనకు 28 ఏళ్లుగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోందన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పనిచేస్తూ సుమారు 28 వేల మంది మహిళలు, అమ్మాయిలను చెరనుంచి విడిపించడమే కాకుండా వారికి పునఃరావాసం కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, సంస్థ సిబ్బంది అనిల్‌కుమార్, మిథాలిరాజ్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

'అమ్మ' పనులపై నిర్లక్ష్యం వద్దు



హెచ్ఎంలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన పాఠశాలలు వారికి కేటాయించిన నిధుల ప్రకారం పనులను వేగంగా పూర్తి చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి, నోడల్ అధికారి, కేజీబీవీ, మోడల్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా ఎంపిక చేసుకున్న పనులను గుత్తేదారుతో మాట్లాడి వేగంగా, నాణ్యతతో పూర్తిచేయాలని సూచించారు. పనులను ఎప్పటికప్పుడూ పరిశీలించాలని, నిర్లక్ష్యం వహించొద్దని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులతో నాయకులు తదితరులు

చేవెళ్ల: మండలంలోని ఊరెళ్ల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన పలువురు ఉపాధ్యాయులకు గ్రామ నాయకులు వీడ్కోలు సమావేశం నిర్వహించి వారిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులది సమాజంలో కీలకపాత్ర అని కొనియాడారు. కష్టపడి పనిచేసి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దినప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాజీ వైస్ ఛైర్మన్ కర్నె శివప్రసాద్, మాజీ సర్పంచ్ జహంగీర్, మాజీ ఉపసర్పంచ్ విఠలయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న వార్డు కౌన్సిలర్ నర్సింహాగౌడ్

కొత్తూరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని మున్సిపాలిటీకి చెందిన 9వ వార్డు కౌన్సిలర్ నర్సింహాగౌడ్ కోరారు. గ్రీన్ బడ్జెట్‌లో భాగంగా ఆయన పలువురితో కలిసి గురువారం వార్డులో మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతోనే సరిపెట్టకుండా వాటి సంరక్షణకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వన మహోత్సం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను నాటాలని సూచించారు. ప్రస్తుతం చెట్లు, అడవుల శాతం తగ్గడంతోనే పర్యావరణంలో పెనుమార్పులు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు శ్రీనివాస్, మహిళా సంఘం సభ్యులు హైమావతి, స్వరూప, జహంగీర్‌బీ, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

కొందుర్గు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధుల ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ అమ్రిత జోసెఫ్ మాట్లాడుతూ.. ఈగలు, దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులన్నారు. ఇల్లు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పెంట కుప్పలు, మురుగు నీరు, చెత్తచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి పైపులైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీఓ లాలయ్య పాల్గొన్నారు.

అల్లుకున్న ప్రమాదం

- విద్యుత్ స్తంభాలపైకి ఎగబాకిన పిచ్చిమొక్కలు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



చిలుకూరు బాలాజీ దేవాలయ సమీపంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయ సమీపంలో రోడ్డు పక్క నుంచి ఉన్న విద్యుత్ లైన్‌లో ఓ స్తంభానికి మొక్కల తీగలు అల్లుకుని ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. పచ్చని తీగలు ఎగబాకి స్తంభం నిపించనంతగా మారింది. వర్షం కురిసే సమయంలోనూ, ఈదురుగాలులు వీచే సమయంలో ఇవి ప్రమాద తీవ్రతను పెంచుతాయి. అయినా విద్యుత్ శాఖాధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకొని పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు తొలగింపు



చెట్టును తొలగించిన పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తా సమీపంలో గల స్వామినారాయణ గురుకుల్ ఎదురుగా మంగళవారం రాత్రి ఈదురుగాలులకు చెట్టు విరిగిపడింది. జాతీయ రహదారి సగం రోడ్డుపై చెట్టు పడడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు అనే శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించి గురువారం చెట్టును తొలగించారు. దీంతో ప్రయాణికులు, హిమాయత్‌నగర్ గ్రామస్తులు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

ఈసీ వాగు వెలవెల



వెంకటాపూర్ వద్ద ఇలా..



అమ్డాపూర్ వద్ద చుక్క నీరులేని వాగు

మొయినాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో భారీ వర్షాలు పడి పెద్ద నదులతో పాటు వాగులన్నీ పొంగి పొర్లుతుంటే ఈసీ వాగులో మాత్రం చుక్కనీరు లేక వెలవెలబోతోంది. ఈ సారి వర్షాకాలం మొదలైనప్పటి నుంచి ఈసీ వాగు ఎగువ ప్రాంతాల్లో అంతంత మాత్రంగానే వర్షాలు కురిశాయి. ఇప్పుడైనా వర్షాలు కురుస్తాయనుకుంటే ముసురు వర్షాలే పడుతున్నాయి. ఈసీకి ఎగువ ప్రాంతాలైన వికారాబాద్ జిల్లాలోని పూడూరు, పరిగి, రంగారెడ్డి జిల్లాలోని షాబాద్, కొందుర్గు, చేవెళ్ల, మొయినాబాద్ ప్రాంతాల్లో ముసురు వర్షమే పడింది. దీంతో ఈసీ వాగులోకి వరదనీరు రాలేదు. గతేడాది జూన్‌లోనే ఈసీ వాగులో భారీ వరదలు వచ్చాయి. కానీ ఈసారి జూలై చివరి వారం వస్తున్నా ఇప్పటికీ చుక్క నీరు రాలేదు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



షాబాద్: కుర్వగూడలో బోనాల ఊరేగింపు



కేశంపేట: బోనాల ఊరేగింపు

షాబాద్: ఆషాఢమాసం పురస్కరించుకొని మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ, సర్దార్‌నగర్, కుర్వగూడ, పెద్దవేడు గ్రామాల్లో బోనాల ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. గురువారం ఉదయం నుంచి భక్తులు దేవాలయాల వద్దకు బారులు తీరి గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని మొక్కులు తీర్చుకున్నారు.

నర్సప్పగూడలో మైసమ్మకు..

నందిగామ: మండల పరిధిలోని నర్సప్పగూడలో మైసమ్మ బోనాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బోనాలను పెద్ద ఎత్తున ఊరేగించారు. డప్పువాయిద్యాలు, కళాకారుల ఆటాపాటలతో వైభవంగా బోనాలను ఊరేగించి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు.

పాపిరెడ్డిగూడలో..

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో గురువారం మైసమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి.

చేవెళ్లలో..

చేవెళ్ల: మండలంలోని ముడిమ్యాల, మండల కేంద్రంలోని పాఠశాలల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి గ్రామంలో సందడి వాతవారణం నెలకొంది. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య డప్పుల చప్పుళ్లతో బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. గ్రామస్తులు బోనాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

షాద్‌నగర్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాలు ప్రతీక అని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న పోచమ్మ దేవాలయం వరకు బోనాల ఊరేగింపు కొనసాగింది. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కొందూటి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, నాయకులు



చేవెళ్ల: బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564